

మొల్ల రచనా శైలి సరళమైనది: డీఆర్‌వో



నివాళులర్పిస్తున్న డీఆర్‌వో పుల్లయ్య

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: కవయిత్రి మొల్ల తెలుగులో ప్రసిద్ధి చెందిన మొల్ల రామాయణంను రచించారని డిఆర్‌వో బి.పుల్లయ్య అన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల జన్మదినం సందర్భంగా మొల్ల చిత్ర పటానికి డిఆర్‌వో పూల మాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి రబ్బానీ బాషా, ఇతర శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విభజించి పాలించేందుకే 'సిఎఎ' చట్టం

మైనార్టీలు, మేధావులు మండిపాటు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బిజెపి ప్రభుత్వం హడావిడిగా తీసుకొచ్చిన భారత పౌరసత్వ సవరణ (సిఎఎ) చట్టం విభజించి పాలించేందుకేనని ముస్లిం మైనార్టీలు, మేధావులు, లౌకికవాదులు మండిపడ్డారు. దీనివల్ల దేశ ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేదన్నారు. బిజెపి మూడోసారి అధికారంలోకి రావడానికి పాచికగా సిఎఎ చట్టాన్ని వాడుకుంటోందన్నారు. 2020లో ఈ చట్టాన్ని తీసుకొచ్చి అమలు చేయడానికి ప్రయత్నిస్తే దేశవ్యాప్తంగా ఆందోళనలు పెల్లుబకడంతో వెనక్కి తీసుకుందన్నారు. సిఎఎ చట్టాన్ని అమలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో 'ప్రజాశక్తి' లౌకికవాదులను పలకరించగా మరోసారి ఆందోళనకు సమాయత్తం అవుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సిఎఎ చట్టాన్ని వ్యతిరేకించి, తాము చేసే పోరాటానికి అండగా నిలవాలని కోరారు.

ప్రజాస్వామ్యవాదులంతా ఏకమవ్వాలి



రఫీ హిందుస్తానీ, జీవకోన

బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన సిఎఎ చట్టాన్ని ప్రజాస్వామ్య వాదులంతా వ్యతిరేకించాలి. 2020లో ఈ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చినపుడు తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద 42 రోజుల పాటు శాంతియుతంగా ఆందోళన చేశాం. మేధావులు, కవులు, రచయితలు అందరూ సంఘీభావం తెలిపారు. ఈ చట్టం కావాలని ఎవరూ కోరుకోవడం లేదు. బిజెపి లబ్ది కోసమే చట్టాన్ని తీసుకొచ్చారు. రద్దు చేసేంత వరకూ పోరాడతాం.

ఆర్‌ఎస్‌ఎస్ సానుభూతి కోసమే



మురళి, సిపిఐ జిల్లా కార్యదర్శి

బిజెపి ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ సంతోషం కోసమే సి ఏ ఏ చట్టాన్ని అమలు చేస్తుంది. నాలుగు సంవత్సరాల క్రితం ఈ చట్టాన్ని తీసుకొచ్చినప్పుడు దేశవ్యాప్తంగా లౌకికవాదులంతా ఉద్యమించారు. దేశ ప్రయోజనాలు పక్కనపెట్టి బిజెపి తన సొంత ప్రయోజనాల కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చి హిందువుల ఓట్లను కొల్లగొట్టడానికి కుట్ర పన్నింది. ఈ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి ముస్లింలపై, దళితులపై, క్రిస్టియన్‌లపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. దేశంలో మణిపూర్ వంటి రాష్ట్రంలో గత కొన్ని నెలలుగా అల్లర్లు జరుగుతున్న దాన్ని అదుపు చేయలేని పరిస్థితిలో కేంద్రం ఉంది. సిఎఎ చట్టం రద్దయ్యే వరకూ సిపిఐ మైనార్టీలకు అండగా ఉంటుంది.

సిఏఏ ఎన్నికల డ్రామా



ఎస్‌ఎం షరీఫ్, ప్రజాతంత్ర వాది

భారత పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆగమేఘాలపై అమలు చేయాలని చూడడం ఎన్నికల డ్రామానే. అనాదిగా బిజెపికి వ్యతిరేకంగా ఉన్న ముస్లిం మైనారిటీలపై ఉక్కు పాదం మోపేందుకు మోడీ ప్రభుత్వం ఈ చట్టాన్ని ముందుకు తీసుకొచ్చింది. 1956 భారత పౌరసత్వ చట్టం ప్రకారం భారత పౌరసత్వం కోరే శరణార్థులకు కొన్ని నిబంధనల మేర పౌరసత్వం ఇచ్చే వెసులుబాటు ఉండేది. అయితే బిజెపి ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన సీఏఏ చట్టం భారత్ పొరుగు దేశాల నుంచి వచ్చే హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, పార్శీలు, జైనులు, బౌద్ధులకు మాత్రమే భారత పౌరసత్వం వర్తించేలా చేయడం దుర్మార్గమైన చర్య. భిన్నత్వంలో ఏకత్వాన్ని కోరే భారతదేశానికి శరణార్థులుగా వచ్చే ముస్లింలకు మాత్రం సిఏఏ చట్టం వర్తించకపోవడం ముమ్మాటికి బిజెపి ఎన్నికల కుట్రే.

బిజెపి ప్రయోజనాల కోసమే..



చింతామోహన్, కేంద్ర మాజీ మంత్రి

సిఎఎ చట్టం బిజెపి రాజకీయ ప్రయోజనాల కోసమే. మూడోసారి అధికారంలోకి రావడం కష్టమని తెలిసే బిజెపి హిందూ ముస్లింల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టడానికే ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. మూడేళ్ల క్రితం ఈ చట్టాన్ని తీసుకొచ్చినపుడు దేశవ్యాప్తంగా నిరసనలతో దద్దరిల్లింది. ఇపుడు మళ్లీ అదే చట్టాన్ని తీసుకొచ్చి దేశ ప్రయోజనాల కోసం కాకుండా ముస్లీం, మైనార్టీలు, దళితులు, క్రిష్టియన్లను ఇబ్బందులకు గురిచేయాలని చూస్తోంది. ఈ పదేళ్లలో బిజెపి ప్రభుత్వం ఎన్నో చట్టాలను తీసుకొచ్చి దేశ ప్రతిష్టను దిగజార్చింది. సిఎఎ చట్టం పనికిమాలిన చట్టం.

లౌకికవాదులు తిప్పికొట్టాలి



పి.అంజయ్య, రిపబ్లికన్ పార్టీ

బిజెపి ప్రభుత్వం రాజకీయ ప్రయోజనం కోసమే ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు కుట్ర పన్నుతోంది. సిఎఎ చట్టాన్ని రద్దు చేయాలని లౌకికవాదులంతా ఏకమవ్వాలి. ఈ చట్టం వల్ల ముస్లీంలు, క్రిష్టియన్లు, దళితుల హక్కులను కాలరాసేలా ఉంది. ఈ దేశం నుంచి ముస్లీంలను వెళ్లగొట్టడానికి బిజెపి కుట్ర పన్నుతోంది. దేశంలో మతం పేరుతో దాడులు జరుగుతున్నాయి. బిజెపి మౌనంగా ఉంటూ ఇలాంటి చట్టాల ద్వారా అగ్గికి ఆజ్యం పోస్తోంది. చట్టం అమలు కాకుండా సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి. రాబోయే ఎన్నికల్లో బిజెపికి గెలుపు కష్టంగా ఉండటం వల్లనే సిఎఎ చట్టాన్ని తీసుకొచ్చింది.

ఎన్నికల కోసమే ఈ చట్టం



వి.నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి

బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం కేవలం ఎన్నికల లబ్ది కోసమే. దేశంలో మత విద్వేషాలు పేరుతో రెచ్చగొట్టి లబ్ది పొందాలని చూస్తుంది. సిఎఎ చట్టాన్ని సిపిఎం మొదటినుంచి వ్యతిరేకరిస్తూనే ఉంది. గతంలో జరిగిన ఆందోళనల్లోనూ సిపిఎం ప్రత్యక్షంగా పాల్గొంది. మోడీ ప్రభుత్వ పాలనలో దేశ ప్రజలు విసిగిపోయారు. రానున్న ఎన్నికల్లో బిజెపికి ఓటమి భయం పట్టుకుంది. అందుకోసమే సిఎఎ చట్టం పేరుతో లబ్ది పొందాలని చూస్తోంది. ప్రజాస్వామ్యవాదులంతా తిప్పికొట్టాలి. చట్టం రద్దయ్యేవరకూ సిపిఎం ఉద్యమిస్తుంది.

చట్టం రద్దయ్యేవరకూ పోరాడతాం

కేంద్రం తీసుకొచ్చిన సిఎఎ చట్టాన్ని ప్రతి ముస్లీం వ్యతిరేకిస్తున్నారు. ఈ చట్టం రద్దు చేసేంత వరకూ పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మూడేళ్ల క్రితం ఈ చట్టాన్ని తీసుకొచ్చినపుడు తిరుపతి మసీదులో ఉండే ముతవల్లిలు, ముస్లీం పెద్దలు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. మసీదులో ప్రార్థనలతో నిరసనలు తెలిపారు. ఇపుడూ అదే పద్ధతులు పాటిస్తాం. దేశంలో హిందూ ముస్లీంలు కలిసి మెలిసి ఉన్నారు. ఈ చట్టం ఎవరికీ అవసరం లేదు.

- మౌలానా మజీదే, తిరుపతి

మతపరమైన గొడవలు సృష్టించడానికే




ఐఎస్ మౌల మజీద్ ఎ నూరాని

బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముస్లీంపై ఏదో ఒక విధంగా దాడులు చేస్తూనే ఉంది. సిఎఎ చట్టం తీసుకొచ్చి హిందూ ముస్లీంల మధ్య గొడవలు సృష్టించి రానున్న ఎన్నికల్లో లబ్ది పొందడానికే కుట్ర పన్నారు. ముస్లీంలు ఎవరూ బిజెపి ప్రభుత్వాన్ని సమర్థించడం లేదు. ఎన్నికల్లో ముస్లీంల సత్తా ఏమిటో ఓటు రూపంలో తెలియజేస్తాం. సిఎఎ వ్యతిరేకించే రాజకీయ పార్టీలకే మా మద్దతు ఉంటుంది. చట్టం రద్దయ్యే వరకూ అందరూ సహకరించాలి.

రిజిస్ట్రేషన్ లేని ఆస్పత్రులు, ల్యాబ్‌లు సీజ్‌చేస్తాం

- ప్రతి ఆస్పత్రి, ల్యాబ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- మరో పది రోజులే ఆఖరి అవకాశం
- ఆ తరువాత ముమ్మర చర్యలు తప్పవు
- ఆస్పత్రి రిజిస్ట్రేషన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రవిరాజు హెచ్చరిక



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డాక్టర్ రవిరాజు

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి ఆస్పత్రి, ల్యాబ్ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రవిరాజు తెలిపారు. బుధవారం నగరి పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కాన్ సెంటర్లను ఆయన తనిఖీచేసి రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని స్కాన్ సెంటర్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనిఖీలు చేసిన ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లలో 90శాతంకు పైగా రిజిస్ట్రేషన్లు లేవన్నారు. తొలి హెచ్చరికగా పది రోజులు గడువు ఇస్తున్నామని ఆ గడువులోపు జిల్లాలోని ప్రతి ఆస్పత్రి, ల్యాబ్, స్కాన్‌సెంటర్ రిజిస్ట్రేషన్ చేసి సర్టిఫికేట్లు పొందాలన్నారు. ఆపై ఉపేక్షించడం ఉండదని రిజిస్ట్రేషన్ లేని ఆస్పత్రులను సీజ్‌చేస్తామన్నారు. అర్హత లేకుండా ఎంబీబీఎస్ బోర్డులు పెట్టి, మెడికల్ షాపులు పెట్టి వైద్యంచేసే నకిలీ డాక్టర్లను గుర్తించడానికే ప్రభుత్వం పటిష్టంగా ఈ ప్రక్రియను కొనసాగిస్తోందన్నారు. తనిఖీలో నకిలీ వైద్యులను కనుగొంటే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. స్కానింగ్‌లో లింగనిర్ధారణ చేసినా చట్టరీత్యా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

సమాచారం కోరితే.. తిప్పుకుంటున్నారు



మీడియాతో మాట్లాడుతున్న వాసుకుమార్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు డ్రా చేసిన ఇంటర్నెట్ చార్జీల బిల్లులు జిరాక్స్ కాపీలు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం ద్వారా కోరగా మూడు నెలల నుంచి కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని ఏపీ బీసీ విద్యార్థి విభాగం రాయలసీమ అధ్యక్షులు వాసు కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంఘిక సంక్షేమశాఖలో ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నదని తెలిపారు ప్రభుత్వ నిధులను అడ్డదారులు సొంత ఖాతాలకు మళ్లించినట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వివరాలను సమాచార చట్టం ద్వారా అడగగా ఏమాత్రం కూడా సాంఘిక సంక్షేమశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని సమాచారం ఇవ్వమంటే కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమానికి పూనుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికల విధులను అదృష్టంగా భావించాలి: జెసీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఎన్నికల విధులు నిర్వహించడం అదృష్టంగా బావించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో 2024ఎన్నికలలో భాగంగా పోలింగ్ రోజు పిఓలు, ఏపిఓలు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పిఓలు, ఏపిఓలుగా గతంలో ఎన్ని సార్లు ఎన్నికల విధులు నిర్వహించినా మళ్ళీ కొత్తగా ఉంటుందన్నారు. రెండు సార్లు శిక్షణా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎన్నికల విధి విధానాలపై పిఓ హ్యాండ్ బుక్ పూర్తిగా చదువుకొని అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రంలో అన్ని వ్యవహారాలను నియంత్రించే చట్ట పరమైన అధికారం పిఓలకు ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అనుసరించాల్సి విధివిధానాలను క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో శిక్షణ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మిప్రసన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివయ్య, సాంఘిక సంక్షేమ మరియు సాధికారత అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మి, బిసి సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.శ్రీదేవి, చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, సౌందర్యరాజన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించండి



- రాజకీయ పార్టీలకు డీఆర్‌వో విజ్ఞప్తి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికలు-2024ను ప్రశాంతంగా వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని డిఆర్‌ఓ ఛాంబర్ వద్ద గల సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డిఆర్‌ఓ మాట్లాడుతూ త్వరలో సార్వత్రిక ఎన్నికలు 2024కు నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ఓటర్ ఎన్రోల్మెంట్, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, పోలింగ్ కేంద్రాల మార్పు ఇతర సంబంధిత అంశాలపై చర్చించారు. ఈవీఎంల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతున్నదని, పోలింగ్ కేంద్రాలలో కనీస వసతుల కల్పనకు అన్ని చర్యలు చేపట్టామని, మైనర్ రిపేర్లు ఉన్నచోట సమస్యలను పరిష్కరించడం జరుగుతుందనన్నారు. సరిహద్దు పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ చేస్తున్నట్లు తెలిపారు. 18సంవత్సరాలు నిండిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేసే ప్రక్రియ జరుగుతున్నదనన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పిఓలు, ఏపీఓలకు జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమాలను బుధవారం నుండి నిర్వహించడం జరుగుతున్నదని ఈనెల 16వరకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందనన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చిన వెంటనే వివిధ రాజకీయ పార్టీల వారు ఏర్పాటు చేసిన బ్యానర్లు కటౌట్లను తొలగించడం జరుగుతుందని ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సంబంధిత రాజకీయ పార్టీలు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వచ్చిన వెంటనే జిల్లా యంత్రాంగం తొలగించడానికి మునుపే ముందస్తుగా వాటిని తొలగించే విషయంలో సహకరించాలని తెలిపారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులైన బీఎస్పీ-భాస్కర్, బిజెపి - అట్లూరి శ్రీనివాస్, సిపిఐ (ఎం) వాడ గంగరాజు, కాంగ్రెస్-పరదేశి, టిడిపి-సురేంద్రకుమార్, వైఎస్ఆర్-ఉదయ్ కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి కుప్పం సీడీపీవోను తొలగించాలి

- రాజకీయ పార్టీల సమావేశంలో సీపీఎం కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: అధికారులు తమ విధుల్లో నిష్పక్షపాతంగా పనిచేయాలని, ఒక పార్టీకి వత్తాసు పలుకుతూ కింది స్థాయి వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఆర్‌వో సమక్షంలో రాజకీయ పార్టీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ జిల్లాలో ఐసిడిఎస్ పరిధిలో కొంతమంది అధికారులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ కింది స్థాయిలో ఉన్న వారందరినీ అధికార పార్టీకి ఓట్లు వేయాలని ప్రత్యక్షంగా ప్రలోభాలు పెడుతున్నారని మండిపడ్డారు. కుప్పం సిడిపిఓను ఎన్నికల విధుల నుంచి తొలగించాలని డీఆర్‌వోను కోరారు. జిల్లాలో కొంతమంది అధికారులు ఎన్నికల నియమ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గతంలో అధికారులు ఎన్నికల్లో చేసిన తప్పులకు ఐఏఎస్ అధికారులు కూడా సస్పెండ్ అయిన పరిస్థితి ఉందని గుర్తు చేశారు. పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని అలా కాని పక్షంలో తప్పులు జరిగితే అందరూ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కుప్పం సంఘటనపై జిల్లా ఎన్నికల అధికారికి రాతపూర్వకంగా అందించారు.

దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- మురుగు కాలువల్లో పూడిక పనులు వేగవంతం
- పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దుతాం
- పారిశుద్ధ్య పనులు పరిశీలించిన కమిషనర్ డాక్టర్ అరుణ



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: నగరంలో దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు నగర కమిషనర్ డాక్టర్ అరుణ తెలిపారు. బుధవారం నగరంలోని కొండారెడ్డిపల్లి, చర్చి వీధిల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. మురుగు నిల్వ ఉండేందుకు వీల్లేదన్నారు. సత్వరగా మురుగు తొలగించేందుకు యాక్షన్ ప్లాన్‌తో చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. అందుకు అధికారులు పూర్తి స్థాయిలో చొరవ తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో దోమల నియంత్రణకు ప్రత్యేకించి స్ప్రేయింగ్‌తో పాటుగా పాత వస్త్రాలు కర్రలకు కట్టి కాల్చడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. సాయంత్రం సమయాల్లో ఫాగింగ్ ప్రక్రియ పక్కాగా చేపట్టాలన్నారు. పారిశుద్ధ్యం మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంహెచ్‌వో చిన్నయ్య, శానిటరీ ఇన్స్‌పెక్టర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ నిత్యం త్రీఫేస్ విద్యుత్

- రూ.210కోట్లతో విద్యుత్ లైన్లు ఆధునీకరణ
- విద్యుత్ శాఖ సీఎండీ సంతోష రావు




విద్యుత్ కార్యాలయాన్ని ప్రారంబిస్తున్న సంతోష్‌రావు

ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రతి గ్రామానికి నిత్యం త్రీఫేస్ విద్యుత్ సరఫరా అందుబాటులోకి తీసుకొస్తామని విద్యుత్ శాఖ సీఎండీ సంతోష్ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రూ.75లక్షలతో నూతనంగా నిర్మించిన విద్యుత్ ఏడీఈ భవనాన్ని డిప్యూటీ సీఎం నారాయణస్వామితో కలసి ప్రారంభించారు. సీఎండీ మాట్లాడుతూ మినిపరిశ్రమలు నెల కొల్పడానికి అనుగుణంగా గ్రామాల్లోని ప్రతి ఇంటికి అవసరమైన త్రీపేస్ విద్యుత్‌ని అందించడానికి పనులు జరుగుతున్నాయని త్వరలో త్రీఫేస్ కరెంటు అందుబాటులోకి వస్తుందన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ జీడీనెల్లూరు నియోజకవర్గానికి రూ.210కోట్లు వెచ్చించి గ్రామాల్లో ప్రతి ఇంటికీ త్రీపేస్ విద్యుత్ అందించడానికి ముందుకొచ్చిన విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి రుణపడి ఉంటామన్నారు. అలాగే గతంలో విద్యుత్ సర్వీసులు కోసం ధరఖాస్తులు చేసుకున్న వారికి మూడు నెలల వరకు గడువు ఉండేదని ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకుపోవడంతో 22రోజుల్లోనే సర్వీసులు అందేలా చూడాలని మంత్రి ఆదేశించిట్లు గుర్తు చేశారు. అదే విధంగా ఎస్సీ నియోజకవర్గం కావడంతో ఎస్సీ, ఎస్టీ కాలనీలో వీధి దీపాలకు కావాల్సిన విద్యుత్ స్తంభాలను అందించి ఆదుకోవాలని తెలిపారు. అనంతరం నూతనంగా నిర్మాణం చేపట్టిన విద్యుత్ భవనాన్ని ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో జీడీనెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి, ఎంపీపీ లతబాలాజీ, మండల కన్వీనర్ శేఖర్రాజు. స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ. విద్యుత్ సీజీఎం ధర్షని, ఎస్ఈ కృష్ణారెడ్డి, ఏస్ఏవో శ్రీనివాసులు, డీఈ సివిల్ తిరుమల రావు. చిన్నరెడ్డెప్ప, గంగాధరరెడ్డి, ఏడీఈలు వేణుగోపాల్, నాగరాజు, ఏఈలు రియాజ్ అహమ్మద్, గిరి, రామాంజనేయులు, ఏవో ఆనందమ్మ, విద్యుత్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

రా.. రమ్మంటున్న చదువులమ్మ

- ఆదర్శ పాఠశాలలో దరఖాస్తులు షురూ..
- 7 పాఠశాలలు.. 700సీట్లు
- మరో 17రోజుల్లో గడువు పూర్తి
- ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష



పుంగనూరు ఆదర్శ పాఠశాల

చిత్తూరు జిల్లాలోని 7 పాఠశాలలు ఇవే..

కుప్పం
గుడిపల్లి
శాంతిపురం
బైరెడ్డిపల్లి
పుంగనూరు
రామకుప్పం
రొంపిచర్ల

ప్రజాశక్తి-పుంగనూరు: గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకూ కార్పొరేట్ స్థాయి ఉచిత విద్యను అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా 2013లో రాష్ట్రంలో 164 ఆదర్శ పాఠశాలలను నెలకొల్పింది. పూర్తి అంగ్లమాధ్యమంలో బోధన అందించే విధంగా ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తి అయ్యే వరకూ పైసా ఖర్చు లేకుండా విద్యార్థులకు సదవకాశాన్ని కల్పించింది. ప్రస్తుతం ఈ పాఠశాలల ద్వారా విద్యనభ్యసించిన విద్యార్థులు రాష్ట్రంలో ఏటా 16వేల మందికి పైగా ఉత్తమ ఫలితాలు సాధిస్తూ.. ఉన్నత చదువులకు వెళుతున్నారు.

దరఖాస్తులు షురూ..

2024-25ఏడాధి ప్రవేశానికి సంబంధించి ఆయా పాఠశాలల్లో ఇప్పటికే దరఖాస్తులు ప్రారంభమైయ్యాయి. ఒక్కో పాఠశాల నుంచి 100మంది విద్యార్థులు ప్రవేశం పొందే అవకాశం ఉంది. మార్చి 31 నాటికి దరఖాస్తుల గడువు ముగియనుంది.

అర్హతలేంటంటే..

ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థులైతే.. 01.09.2010-31.08.2014 మధ్య పుట్టి ఉండాలి. ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులైతే.. 01.09.2012-31.08.2014మధ్య పుట్టి ఉండాలి. సంబంధిత జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొంది ఉండాలి.

దరఖాస్తు ఎలా చేసుకోవాలంటే..

ఆదర్శ పాఠశాల వెబ్‌సైట్ www.cse.ap.gov.in లేదా www.apms.ap.gov.inను సంప్రదించాలి. విద్యార్థి పూర్తి వివరాలు అందులో పూరించాలి. ఆ తరువాత ప్రవేశ రుసూము చెల్లించాల్సి ఉంటుంది. ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఆ తరువాత అప్లికేషన్ ఫారాన్ని సంబంధించిన పాఠశాలలో నేరుగా అందజేయాలి. ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తులను పాఠశాలల్లో సమర్పించాలి.

ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలి..

ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది. అందులో భాగంగా ఏప్రిల్ 21న పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పరీక్ష 21న ఉదయం 10.00గంటల నుంచి మధ్యాహ్నం 12.00గంటల వరకూ నిర్వహిస్తారు. 5తరగతి స్థాయిలో తెలుగు/ఇంగ్లీషు మీడియంలో ఉంటుంది. ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నా ప్రతం ఉంటుంది. ఈ పరీక్షలో ఓసీ, బీసీలు 35మార్కులు, ఎస్సీ, ఎస్టీలు 30మార్కులు సాధించాల్సి ఉంటుంది.

ఉన్నత స్థాయి ప్రమాణాలతో..

ఆహ్లాదకరమైన తరగతి గదులు, సువిశాలమైన పాఠశాల ప్రాంగణం, చదువులతో పాటు క్రీడలకు ప్రాధాన్యత, అందుబాటులో కంప్యూటర్, అటల్ ల్యాబ్‌లు. పూర్తి స్థాయి నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల ద్వారా ఉచిత విద్యాబోధన ఈ పాఠశాలల్లో ప్రత్యేకం. ఇంటర్మీయట్ వరకూ ఉచితంగా విద్యాబోధన. 100మంది ఇంటర్ విద్యార్థినీలకు హాస్టర్ సౌకర్యం కల్పిస్తున్నారు.

ఆదర్శంగా ఫలితాలు..



డాక్టర్ టి.ఎస్ రమ, ప్రిన్సిపల్, పుంగనూరు, ఆదర్శ పాఠశాల

ప్రతి ఏటా పది, ఇంటర్మీయట్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఇక్కడ చదువు కున్న విద్యార్థులు ట్రిబుల్ ఐటీ, మెడిసిన్‌లలో సీటు సాధిస్తున్నారు. ఉన్నత స్థాయి విద్యా ప్రమాణాలతో బోధిస్తున్నాం. ఆరవ తరగతి ప్రవేశాలకు ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తాం. పేద విద్యా ర్థులు సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

వడదెబ్బ పట్ల జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: వడదెబ్బ పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బంగారుపాళ్యం క్లస్టర్ వైద్యులు డాక్టర్ శిరీష అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వైద్య విధాన పరిషత్‌లో ప్రతి బుధవారం చేపట్టే గర్భిణీల పరీక్షలకు హాజరైయ్యారు. వడదెబ్బ పట్ల పలు సూచనలు చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఐసిటిఎస్ కౌన్సిలర్ బాబు, టెక్నీషియన్ జయచంద్ర, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సరస్వతీ పూజ ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం ఎల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో శివరత్నమ్మ హాజరయ్యారు. ఎంఈవోతో పాటుగా మహిళా ఉపాధ్యాయులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మాంచి స్వీట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఇంటి పట్టాలు అందజేత

ప్రజాశక్తి-పుంగనూరు: పేదలందరికీ ఇండ్లు పథకం కింద 37మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పూర్తి దస్తావేజులను అందజేస్తున్నట్లు కౌన్సిల్ పూల త్యాగరాజు తెలిపారు. పట్టణంలోని తొమ్మిదవ సచివాలయంలో బుధవారం దస్తావేజుల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9వ సచివాలయంలో పేదలందరికి ఇండ్లు పథకం క్రింద 25, 24వార్డులోని ఇండ్లు మంజూరు కాబడిన 37మంది లబ్ధిదారులుకు రిజిస్ట్రేషన్ పూర్తి అయిన దస్తావేజులను అందజేశామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గంగులమ్మ, సచివాలయం సిబ్బంది, సెక్రటరీలు, విఆర్‌వో సాయి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఓటుపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-సోమల: ప్రతి ఒక్కరూ ఓటుపై అవగాహన కలిగి ఉండాలని ఏపీఎం శివ అన్నారు. బుధవారం వెలుగు కార్యాల యంలో మహిళా సంఘాలతో సమావేశమై ఓటు అవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సీసీలు, మండల సమాఖ్య అధ్యక్షులు రెడ్డెమ్మ, కార్యదర్శి గౌరీదేవి తదితరులు పాల్గొన్నారు.

యాదమరి: ఓటు ప్రాధాన్యతను దాన్ని వినియోగించుకునేందుకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏపీఎం కల్పన రెడ్డి అన్నారు. బుధవారం మండల సమైక్య కార్యాలయంలో మండలంలోని సంఘమిత్రలకు, వివోఏలకు, సంఘం సభ్యులకు ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు బాలసుబ్రమణ్యం, లక్ష్మీపతి, వెంకటేష్ మండల సమాఖ్య ప్రతినిధులు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'టిడిపితోనే మహిళాభివృద్ధి సాధ్యం'

ప్రజాశక్తి-రామకుప్పం: టీడీపీతోనే మహిళాభివృద్ధి సాధ్యమని కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మునిరత్నం, మనోహర్ తెలిపారు. బుధవారం మండలంలోని మూడవ క్లస్టర్ మహిళ సాధికార సారథుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు ఎటువంటి ఆసరా లభించలేదన్నారు. పేద కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయిన పాలకులు పట్టించుకోలేదన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నేతలు మునస్వామి, ఆనందరెడ్డి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, చలపతి, నందరెడ్డి, మహమ్మద్ రఫీ, పద్మమ్మ, అలివేలు మంగమ్మ, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరం

ప్రజాశక్తి-యాదమరి: చదువుతో పాటు విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరమని స్పందన ఫౌండేషన్ అధినేత శ్యామలాదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ఘనంగా వార్షిక క్రీడా దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్పందన ఫౌండేషన్ అధినేత శ్యామలాదేవి, అలాగే యాదమరి మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ మేనేజర్ మురళి, అసిస్టెంట్ మేనేజర్‌లు పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం గిరిరాజ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల యందు కూడా ఆసక్తి ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి
విగ్రహ ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-రామకుప్పం: స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ఏర్పాటుకు తహశీల్దార్ కార్యాలయంలో డిటి దిలీప్‌కుమార్‌కు రెడ్డి సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. రామకుప్పం మండల కేంద్రంలోని బందార్లపల్లి మలుపు వద్ద స్థలాన్ని కేటాయించి విగ్రహ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నితిన్ రెడ్డి, చంద్రారెడ్డి, కేశవరెడ్డి, పాపిరెడ్డి, జనార్దన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఇన్స్పైర్ సైన్స్ సంబరాలు ముగింపు

ప్రజాశక్తి-గంగవరం: మదర్ తెరిస్సా విద్యా సంస్థలు ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనలు బుధవారం ముగింపు సంబరాలు నిర్వహించారు. మదర్ తెరిస్సా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, గంగవరం మండలంలో వైభవంగా ఈ సంబరాలను నిర్వహించారు. రాష్ట్రస్థాయిలోని 26జిల్లాల నుండి విచ్చేసిన గైడ్ ఉపాధ్యాయులు, యంగ్ సైంటిస్టు ప్రదర్శనలతో ప్రాంగణం మూడు రోజుల సైన్స్ మేళ జరిగింది. ఇందులో 2004ప్రదర్శనలు జిల్లా స్థాయి నుంచి ఎంపిక చేసిన ప్రయోగాలు ఇక్కడ ప్రదర్శించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు శ్రీనాథ్, చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్దపీట: రోజా

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. బుధవారం నగరి మున్సిపాలిటీ చింతల పట్టెడలో కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ స్థలంలో కేటాయించిన శెంగుంధర్లు అందరూ విరాళాలు పోగుచేసి ఈ కళ్యాణ మండపాన్ని నిర్మించారు. కాగా బుధవారం మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, శెంగుంద సామాజికవర్గ పెద్దలు పాల్గొన్నారు.

జగనన్న లేఔట్‌ల పరిశీలన



ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: జీడీ నెల్లూరు మండల కేంద్రంలోని జగనన్న హౌసింగ్ లేఔట్‌లను బుధవారం ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ద్రాక్షాయిణి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న గృహ పథకం ద్వారా లబ్ధిదారులకు అందించడంలో చిత్తూరు జిల్లాలోనే జీడీ నెల్లూరు మండలం మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. లేఔట్‌లో దాదాపు 450మంది లబ్ధిదారులకు పట్టాలు అందించగా 95శాతం ప్రజలు గృహాలు నిర్మించుకొని నివసిస్తున్నారని పేర్కొన్నారు. జగనన్న ప్రభుత్వంలో పేద ప్రజలకు అర్హత ప్రామాణికంగా ఇంటి పట్టాలు మంజూరు చేశారని ప్రభుత్వ సాయంతోనే తాము త్వరగా ఇల్లు నిర్మించుకొని నివసిస్తున్నామని డైరెక్టర్ ద్రాక్షాయినికి లబ్ధిదారులు తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ లిల్లీ కుమారి, ఇన్చార్జి హౌసింగ్ ఏఈ దాము, వర్క్ ఇన్స్పెక్టర్ గీత పలువురు అధికారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ప్రారంభోత్సవాలు

- నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం సుడిగాలి పర్యటన



గంగాధర నెల్లూరు: ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన పలు అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రారంభించారు. అల్లి ఎల్లమ్మ దేవస్థానం ఆవరణంలో ధర్మకర్తలు పార్థసారథి రెడ్డి, ఈయన సోదరులు రవీంద్రారెడ్డి, గుణశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.16 లక్షలు సొంత నిధులతో నిర్మించిన వాణిజ్య సముదాయాన్ని, అదేవిధంగా మహాదేవ మంగళంలో సచివాలయం భవనాన్ని, ఆర్బీకే భవనాన్ని డిప్యూటీ సీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బాబురెడ్డి, లక్ష్మిప్రియ, వెంకటరెడ్డి, ఏకాంబరం, చిన్నమరెడ్డి, బలరామిరెడ్డి, సురేంద్రారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


కార్వేటినగనరం: సరస్వతీ నిలయాలుగా విరాజిలుతున్న ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం పునర్జీవం పోశారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. బుధవారం మండలంలో నాడు-నేడు పథకం ద్వారా ఆధునీకరించిన ప్రభుత్వ పాఠశాలలు, ఆర్బీకే, సచివాలయం, సదాశివేశ్వరస్వామి ఆలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను ఎంపీపీ లతబాలాజీ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్రాజు, స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కర్త కళత్తూరు కృపాలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్రెడ్డి, సింగిల్ అధ్యక్షుడు లోకనాథరెడ్డి, విశ్రాంతి తుడా ప్లానింగ్ అధికారి కృష్ణారెడ్డి, సుబ్బులురాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణయాదవు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి సహకరిస్తాం..



ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: మహిళాభివృద్ధికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుంది అని యూనియన్ బ్యాంకు నగరి బ్రాంచ్ హెడ్ యువరాజ్, మేనేజర్ ఆర్డీవో నిత్య అన్నారు. బుధవారం నగరి పట్టణ పరిధి సిద్ధివినాయక సత్యసాయి ఆలయంలో సత్య ఎస్‌హెచ్‌జీ సభ్యులు నిర్వహించిన మహిళాదినోత్సవ వేడుకల్లో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. మహిళలకు మహిళాదినోత్సవ బహుమతులును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు అందిస్తున్న సహకారాన్ని వివరించారు. బ్యాంకు రుణాలు పొంది గ్రూపులోని వారు చేపట్టే, వృత్తి వ్యాపారాలను ఆరాతీశారు. మహిళల అభివృద్ధికి తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని మహిళలకు సూచించారు. రుణాలు పొందడంలో ఏ సమస్యలున్నా, సందేహాలున్నా తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



ఎమ్మెల్సీ సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని కుప్పిగానిపల్లి పంచాయతీ కోటచెంబగిరికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. బుధవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో 14కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్సీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బాబు నాయుడు, నాయకులు మునిరత్నం, చంద్రశేఖర్, బేటప్పనాయుడు పాల్గొన్నారు.

యాదమరి: మండలంలోని మోర్ధానపల్లి పంచాయతీకి చెందిన పలువురు బుధవారం టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ పూతలపట్టు ఇన్‌ఛార్జ్ డాక్టర్ కలికిరి మురళిమోహన్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో 20కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. కార్యక్రమంలో నాయకులు మురాజీయాదవ్, వెంకటేష్ రబ్బీ, కుమార్, అమరనాథ్‌నాయుడు, బాలకృష్ణ, మదన్, రాజేష్, త్యాగరాజులు, భాస్కర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గంగ లేక.. రైతన్నకు బెంగ!

ప్రజాశక్తి - ఓజిలి:

తెలుగు గంగ నీరు రాక రైతులు బెంగ పడుతున్నారు. పంటలను కాపాడు కోలేక రైతాంగం ఆందోళన చెందు తున్నారు. చివరి తడి కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. రాత్రనకా, పగలనకా కంటికి రెప్పలా కాచుకుని వరి పంటలు సాగు చేస్తుంటే కళ్లెదుటే నీరు లేక పంట ఎండుతుంటే రైతు కళ్ళల్లో కన్నీటిధారలు కారుతున్నాయి. చెరువుల్లో నీరు అడుగంటడంతో వందల ఎకరాల్లో వరి ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. పాలకులు సభలో హామీలు కురిపి స్తున్నారు తప్ప కార్యాచరణకు నోచుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రాజెక్టుల్లో నీరు ఉన్నా పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

ఓజిలి మండల పరిధిలోని వందలాది ఎకరాల్లో వరి పైర్లు సాగు చేస్తున్న రైతులు నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. ఆఖరి తడిలో పంట చేతికి వచ్చే సమయానికి చెరువుల్లో ఉన్న నీరు కాస్త అడుగంటి పోవడంతో నీళ్ల లేక వరి ఎండిపోతుండడంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో ఆందోళనకు గురవుతున్నారు. వేలాది రూపాయలు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టామని ఆఖరితడిలో నీళ్ల లేక వరి పైర్లు ఎండు ముఖం పట్టాయని ,తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక అయోమయం స్థితిలో ఉన్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా నీళ్ల అందించి ఆదుకోవాలని రైతులు ఆర్తనాదాలు చేస్తున్నారు. తెలుగు గంగ నీరు ఆఖరి తడికైనా వస్తాయనే నమ్మకంతో నే చెరువుల కింద వరి పైర్లు సాగు చేసామని రైతులు వాపోతున్నారు. వివిధ మండలాల్లో రాజకీయ బలంతో నాయకులు తమ

చివరి తడి కోసం అగచాట్లు



తమ రాజకీయ పలుకుబడులను ఉపయోగించి తెలుగు గంగ నీళ్లను తమ తమ ప్రదేశాలకు తరలించకపోతున్నారని ఓజిలి మండలంలో మాత్రం ఆ పరిస్థితులు కనబడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలుగంగ నీరు రాకపోతే తీవ్ర నష్టాన్ని చవి చూడాల్సి వస్తుందని రైతులు గగ్గోలు పెడు తున్నారు. ఇప్పటికైనా సంబంధిత తెలుగు గంగ అధికారు లు స్పందించి రైతులకు నీళ్లు ఇచ్చి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

ఆర్అండ్‌బి రోడ్డుకు మరమ్మతుల్లేవ్!

- స్పందించని అధికారులు - ప్రయాణికులు, విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి- కేవిబిపురం: కెవిబిపురం మండలంలోని మారుమూల ప్రాంతమైన కోట , మంగాపురం రోడ్డు గతంలో కురిసిన తుపానుకు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి మూడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెళ్లడానికి దారి లేక పడరాని పాట్లు పడుతున్నారు. వాహనదారులు రాత్రి వేళలో వెళ్లాలంటే ఎప్పుడు ఏ పరిస్థితి ఎదురవుతుందోనని భయం గుప్పెట్లో పెట్టుకుని పొలాలపై వెళ్లాల్సి వస్తోంది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే రోడ్డు లేకపోవడంతో బస్సులు రాక సుమారు ఐదు కిలోమీటర్లు నడిచి వెళ్లి పుత్తూరుకు బస్సు ఎక్కాల్సిన దుస్థితి గ్రామంలో నెలకొంది. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఏమాత్రం పట్టించు కోవడం లేదని విద్యార్థులు, ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బ్రిడ్జి ఏర్పాటు చేసి తమ గ్రామానికి బస్సు వచ్చేలా



చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఖజానా అధికారుల కక్ష

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

రాష్ట్ర ఖజానా అధికారుల ఆదేశాలు విస్మరిస్తూ ఆదాయపు పన్ను పరిధిలో లేని వారి వద్ద సైతం జమ చేయాలని పుత్తూరు ఖజానా అధికారులు కక్ష సాధింపుతో వ్యవహరిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విశ్రాంత ఉద్యోగుల సంఘం తిరుపతి జిల్లా ఖజానా కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు భాస్కర్ రాజు మాట్లాడుతూ సుమారు 35 సంవత్సరాలు పాటు సమాజానికి వివిధ హోదాల్లో సేవలు అందించి విశ్రాంత జీవనంలో ప్రశాంతంగా జీవించా లంటే ప్రతినెల పెన్షన్ అవసరం అని, పెన్షనర్లు ఆదాయపు పన్ను పరిధిలోకి రాకపోయినా పుత్తూరు ఎస్‌టిఓ, వారి సిబ్బంది కక్ష సాధింపుతో వ్యవహరి స్తున్నారని వారి పై తక్షణం చర్యలు తీసుకొని పెన్షనర్లకు న్యాయం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఏపీఎస్‌జి కోశాధికారి, జిల్లా పుత్తూరు సంఘం నాయ కులు 50 మంది తిరుపతి జిల్లా ఖజానా కార్యాలయం వద్దకు చేరుకుని జిల్లా ఖజానా అధికారి ఎం లక్ష్మీకర్ రెడ్డిని కలిసి పుత్తూరు ఖజానా సిబ్బంది తీరును వివరించారు. గతంలో అనేక ఆదాయపు పన్ను రికవరీపై విజ్ఞప్తులు చేసినా వాటిని పట్టించుకోకుండా పుత్తూరు ఎస్‌టిఓ వ్యవహరిస్తున్నారన్నారు. ఆదాయపు పన్ను పరిమితి ఏడు లక్షల 50 వేల రూపాయల వరకు రికవరీ చేయకూడదని ఆదాయపు పన్ను చట్టాలలో ఉన్నా పాటించ కుండా వారికి న్యూ రెజిమ్ పన్ను చట్టాలు ప్రకారమే పన్ను రికవరీ చెయ్యాలని రాష్ట్ర ఖజానా అధికారులు చెబుతున్నా పట్టించుకో వడం లేదన్నారు. క్షుణ్ణంగా పరిశీలించి పన్ను నెలకు రూ.46వేల పెన్షన్ పొందుతున్న పెన్షనర్ కూడా 40 వేల రూపాయలు అక్రమంగా ఇన్‌కంటాక్స్ పేరుతో రికవరీ చేసి తీవ్ర మన వేదనను కలిగించా రన్నారు. వెంటనే చర్యలు తీసుకుని పెన్షనర్లకు న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కేఆర్ శంకర్, ప్రధాన కార్యదర్శి జయరాం నాయుడు, జిల్లా సహాధ్యక్షులు యుగంధర్ రాజు, టి గోపాల్, జిల్లా సంఘటన కార్యదర్శి రవిశంకర్ రాష్ట్ర మహిళా కార్యదర్శి కృపవరమ్మ, పుత్తూరు పెన్షనర్ల సంఘం నాయకులు కుప్పయ్య, గుణశేఖర్ రెడ్డి, అరుణాచలం రెడ్డి, మోహన శెట్టి, మురహరి, తిరుపతి నగర్ శాఖ ప్రధాన కార్యదర్శి వెంకటేశం శెట్టి, కోశాధికారి నగర శాఖ అధ్యక్షులు సి టి ఆర్ సురేష్ బాబు, ఎస్ జి మునికృష్ణ, కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, పెన్షనర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.



జిల్లా ఖజానా కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పలువురు

ప్రజాశక్తి-యాదమరి: యాదమరి ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో పని చేస్తున్న మహిళ ఉపాధ్యాయులకు తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం గిరిరాజా మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న మహిళలందరూ బాలికలందరినీ కాబోయే మహిళలుగా ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ మహిళా దినోత్సవం యొక్క ప్రాధాన్యతను వివరించారు.

వేలం పాటలో రూ.22లక్షల ఆదాయం

ప్రజాశక్తి-శాంతిపురం: సంత వేలం పాటలో పంచాయతీకి రూ.22లక్షలు ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి అశ్వత్ నారాయణ, రవినాయక్ తెలిపారు. మండలంలోని కెనమాకుల పల్లి పంచాయతీలోని బడుగుమాకులపల్లి వారపు సంతకు బుధవారం వేలం నిర్వహించామన్నారు. అందులో భాగంగా ఎద్దులు పశువులు వారపు సంత రూ.8.71లక్షలు, అంగళ్ళ కూరగాయల వారపు సంత రూ.3.70లక్షలు, ప్రైవేటు వాహనాల రుసుము వసూళ్లకు సంబంధించి రూ.4.99లక్షలు, గొర్రెలు కోళ్ల వారపు సంతను రూ.4.60లక్షలకు వేలం వేశారు. వేలంపాటను స్థానిక సర్పంచ్ ఏవి జయరాం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి శ్రీనివాసులు, కో ఆప్షన్ సభ్యులు నిసార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



వెదురుకుప్పం: కార్యక్రమంలో మాట్లాడుతున్న హెచ్ఎం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: వెదురుకుప్పం జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం బుధవారం జరిగింది. హెచ్ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలలో మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, గ్రామంకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎంపీటీసీ రాధిక పురంధర్‌రెడ్డి, మురళిరెడ్డిలు రూ.10వేల విలువైన కుర్చీలను పాఠశాలకు వితరణ చేశారు.

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల వార్షికోత్సవం జరిగింది. పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు జరిగింది. ఇన్‌ఛార్జ్ హెచ్ఎం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పాఠశాలకు అవసరమైన రూ.45వేల విలువైన మైక్‌సెట్‌ను దాతలు కానుక ఇచ్చినట్లు చెప్పారు. మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించుటకు లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ కె.రాజా రెడ్డి రూ.5వేల నగదును పాఠశాల హెచ్ఎం జయకుమార్ రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, ఎంఈవో శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను
సద్వినియోగం చేసుకోండి: డీఆర్‌వో

ప్రజాశక్తి-చిత్తూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌వో పుల్లయ్య అన్నారు. ప్రధాన మంత్రి సామాజిక్ ఉత్థాన్ ఏవం రోజ్‌గర్ అధరిత్ జనకళ్యాణ్ పోర్టల్‌ను బుధవారం ప్రధాని మోడీ ప్రారంభించారు. అందులో భాగంగా చిత్తూరు నుంచి డీఆర్‌వో జిల్లా సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. ఇంకా జిల్లా నుంచి ముఖ్య అధికారులు ఆ కార్యక్రమానికి హాజరైయ్యారు.

సోమల ఎంపీడీవోగా నారాయణ



ప్రజాశక్తి-సోమల: సోమల ఎంపీడీవోగా నారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గత నెల 7వ తేదీ కర్నూలు జిల్లా నుండి వరప్రసాద్ ఎంపీడీవో సోమలకు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టి తిరిగి బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం పుంగనూరు ఈవోపీఆర్డిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ సోమల ఇన్‌ఛార్జ్ ఎంపీడీవోగా నారాయణ బాధ్యతలు చేపట్టారు.

భానును కలిసిన వ్యాపారవేత్త

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని కిచ్చన్నాయుడుపల్లికి చెందిన వ్యాపారవేత్త గాలి శ్రీనివాసులునాయుడు బుధవారం టీడీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానును కలిశారు. బెంగళూరులో జరిగిన ప్రవాసాంధ్రుల ఆత్మీయ సమావేశంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు నాయకులు గోపీనాథ్, శ్రీకాంత్, రాము, మహేష్, జనార్ధన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా ప్రభుత్వం: ఎమ్మెల్సీ



ప్రజాశక్తి-శాంతిపురం: మహిళలకు అండగా జగనన్న ప్రభుత్వం నిలుస్తుందని ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన నాలుగో విడత చేయూత పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని వారికి ఆర్థికంగా చేయూతనించించేందుకే జగనన్న చేయూత కార్యక్రమాన్ని ప్రారంభించారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పిటిసి శ్రీనివాసులు, ఎంపీపీ వసుంధర కోదండరెడ్డి, నాయకులు దండపాణి, జయరాం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం..

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల 1982-83సం.లో 10వ తరగతి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకుని విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం హేమలత, ఇన్‌ఛార్జ్ ఉపాధ్యాయులు దినకరన్, పూర్వ విద్యార్థులు ప్రభాకర్ రెడ్డి, లోకనాథరెడ్డి, మధుసూదన్, నిత్యానందం, రవినాయుడు, జయచంద్రనాయుడు, జగన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యా సామగ్రిని అందజేస్తున్న దాతలు